పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం



పెనుగొండ: ఆచంటలో జరిగిన వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు



నరసాపురం రూరల్: కొప్పర్రులో నిర్వహించిన వైద్య శిబిరంలో మహిళ అనారోగ్య సమస్యలు తెలుసుకుంటున్న వైద్యుడు



యలమంచిలి: శిరగాలపల్లిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు

- ప్రతి కుటుంబానికి సీఎం జగన్ అండగా నిలుస్తున్నారంటున్న ప్రజలు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

పెనుగొండ: పేదలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చి అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం గ్రామంలోని సచివాలయం-3 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదలకు విద్య, వైద్యాన్ని చేరువ చేసి వారి కుటుంబ పెద్దగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు. దేశానికి దిక్సూచిగా నిలుస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో నిర్వహించడంతో పేదల ఆదరణ నానాటికీ పెరుగుతోందన్నారు. ఇక నుంచి ప్రతి నెలా జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించడంతో పాటు, ఫ్యామిలీ డాక్టర్‌కు అనుసంధానం చేసి వారి ఇంటికే వైద్యులను పంపడం జరుగుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల జారీ చేశారన్నారు. పేదలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రోగాలను ఆదిలోని గుర్తించి వైద్యాన్ని చేయించుకునే వెసులుబాటు కల్పించారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాని, సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్, ఈఓఆర్‌డీఓ మూర్తిబాబు, డీటీ సంధ్య, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సంధ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కోళ్ల రాజారావు, కుక్కల కిరణ్, వేమన అప్పారావు, దిగమర్తి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ బాధ్యతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. నరసాపురం మండలం కొప్పర్రు సచివాలయం వద్ద సోమవారం జరిగిన శిబిరంలో 5గురు వైద్యుల బృందం గ్రామానికి చెందిన 700 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు, సుమారు 23 మందిని మెరుగైన వైద్య సేవలు అవసరంగా గుర్తించి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఆపరేషన్లు సూచించడంతో పాటు కళ్ల జోళ్లు అవసరమైన వారిని గుర్తించి వారికి వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ ఇంజేటి జాన్ కెనడీ తదితరులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశం, రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమం మునుపెన్నడూ జరగలేదన్నారు. పేద ప్రజలు ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుని అవసరమైన వారికి వైద్యం అందించడమే ఈ బృహత్తర కార్యక్రమం ముఖ్య లక్ష్యమని ఆయన అన్నారు. శిబిరంలో మధుమేహం, బీపీ, హిమోగ్లోబిన్, డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి స్పెషలిస్టు డాక్టర్లతో వైద్య సేవలందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఆరోగ్య మిత్ర, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

యలమంచిలి: రోగులులేని సమాజాన్ని నిర్మిద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు పిలుపునిచ్చారు. మండలంలోని శిరగాలపల్లి గ్రామంలో సోమవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. గ్రామాల్లో ఉండే వారికి సైతం ఏ చిన్న రోగం వచ్చినా కార్పొరేట్ వైద్యం అందించాలనే ఆశయంతో జగనన్న ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో డాక్టర్ కొవ్వూరి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, డాక్టర్ సంతోష్, డాక్టర్ చంద్రరేఖ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి, సర్పంచ్‌లు వల్లభు సాయి వెంకట నరసింహారావు, కవురు గోపి, పాలంకి శ్రీనివాసరావు, గటిగంటి మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు వినుకొండ రవి, బోనం బులివెంకన్న, వలవల బాలాజీ, వలవల సత్యధర్మారావు, వీరవల్లి నరసింహమూర్తి, చిలుకూరి మురళీకృష్ణ, సజ్జా శ్రీనివాస్, వల్లూరి బలరామమూర్తి, పైడి వెంకటేశ్వరరావు, పెంటపాటి నూకరాజు, జవదాల సువర్ణరాజు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీన తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరులో సప్తనదీ జలాభిషేకాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు, అమ్మవార్లు

కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం సాయంత్రం సప్తనదీ జలాభిషేకాలు ప్రారంభమయ్యాయి. వేద మంత్రోచ్చారణలతో ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీఫణికుమార్ శర్మ, శ్రీవెంకటరమణ ఆచార్యత్వంలో శ్రీస్వామివారి వారికి సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామివారిని ఆలయ ప్రదక్షిణం గావించి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, ఋత్విక్ వరుణ, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, నీరాజనం మంత్రపుష్పములు, తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమానికి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

తపాలా శాఖ వారోత్సవాలు ప్రారంభం



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో శ్రీవిజ్ఞానవేదిక, తపాలా శాఖ అధ్వర్యంలో తపాలా శాఖ వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి తపాలా శాఖ అమల్లో ఉందన్నారు. హెడ్ పోస్ట్ మాస్టర్ ఎస్ఎన్ రామాచార్యులు మాట్లాడుతూ ఈనెల 16 వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, పోస్టల్ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్‌లపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్టల్ శాఖ సహకారంతో ఈ వారోత్సవాల్లో స్టాంపుల ప్రదర్శన, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని, ఉత్తమ పోస్ట్‌మెన్‌లకు సత్కారం చేస్తామన్నారు. పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్ అల్లు సురేష్, లయన్స్ జోన్ చైర్మన్ నందమూరి రాజేష్, అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, గంటా సుందర్ కుమార్, మట్లపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాలధారులకు ఉచిత భిక్ష ప్రారంభం



కుప్పనపూడిలో భిక్షను ప్రారంభిస్తున్న దృశ్యం

ఆకివీడు: మాలధారులందరికీ ఉచితంగా అల్పాహారం, భోజన వసతిని ప్రముఖ రైస్ మిల్లర్ కొటికలపూడి వెంకట సూర్యనారాయణ స్వామి సోమవారం ప్రారంభించారు. కుప్పనపూడికి చెందిన నూకల రామదాసు గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారులకు ఆరేళ్లుగా ఉచిత భోజన వసతి కొనసాగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 11.30 గంటల నుంచి అల్పాహారం, భిక్ష అందిస్తున్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాలు, పక్క జిల్లా నుంచి అధిక సంఖ్యలో మాలధారులు వచ్చి ఇక్కడ భిక్ష స్వీకరిస్తున్నారన్నారు. నిర్వాహకులు రామదాసు మాట్లాడుతూ సోమవారం నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు ఉచిత అల్పాహారం, భిక్షను మాలధారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో, సొంత ఖర్చులతోనూ అయ్యప్ప, భవానీ, వేంకటేశ్వరస్వామి, శివ మాలదారులందరికీ భోజన వసతిని స్వాముల కరుణకటాక్షాలతో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానికులు ముత్యాల రత్నం, గురుస్వామి నీలకంఠం, చుండూరి నరేంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో దూకేందుకు వ్యక్తి యత్నం.. కాపాడిన సీఐ

సాక్షి, భీమవరం: ఆత్మహత్యకు పాల్పడేందుకు డ్రెయిన్‌లో దూకేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని ట్రాఫిక్ సీఐ జి.దాసు కాపాడిన ఉదంతమిది. పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్ వద్ద సోమవారం ఓ వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోనికి దూకేందుకు ప్రయత్నించగా అదే సమయంలో అటుగా వెళుతున్న సీఐ దాసు అతని ప్రవర్తనపై అనుమానంతో తన మోటారుసైకిల్‌ను పక్కనపెట్టి అతడ్ని అడ్డుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ఈ ఘటనకు సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

సచివాలయ సర్వేయర్ ఆత్మహత్య

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడకు చెందిన సచివాలయ సర్వేయర్ అడ్డేపల్లి వెంకట లక్ష్మీ దుర్గారావు (27) ఆదివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గణపవరం ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఈయన ఉండి మండలం కోలమూరు గ్రామ సచివాలయంలో సచివాలయ సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. ఇతను అవివాహితుడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్న దుర్గారావు అర్ధరాత్రి దాటిన తర్వాత వంట గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న సమయంలో ఆయన ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి 1 గంట సమయంలో లేచిన తల్లి దుర్గారావు ఫ్యానుకు వేలాడుతుండటం చూసి ఇంట్లో వారిని నిద్రలేపింది. కుటుంబ సభ్యులు దుర్గారావును కిందికి దింపగా అప్పటికే మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు నెలల క్రితమే విధుల్లోకి..

ఉండి: కోలమూరు సచివాలయం సర్వేయర్ దుర్గారావు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటంతో సహచర ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సహోద్యోగులతో ఉత్సాహంగానే గడిపిన దుర్గారావు బలవన్మరణానికి పాల్పడటం బాధాకరంగా ఉందని అంటున్నారు. గణపవరం మండలం జి.కొండేపాడులో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన దుర్గారావు నాలుగు నెలల క్రితమే కోలమూరు సచివాలయానికి బదిలీ అయ్యారు.

మణిపూర్ బాధితులకు సహకారం



మణిపూర్‌లో నిత్యావసర సరుకులు అందిస్తున్న నరసాపురం హోప్ మినిస్ట్రీస్ సభ్యులు

నరసాపురం రూరల్: మణిపూర్‌లో చర్చ్‌లు, క్రైస్తవ మహిళలపై జరిగిన అత్యంత దారుణమైన మారణ హోమానికి గురైన బాధితులకు నరసాపురానికి చెందిన హోప్ మినిస్ట్రీస్ సంస్థ సహకారం అందించింది. సుమారు 11 లక్షల విలువ చేసే నిత్యావసరాలను, మినిస్ట్రీస్ ఫౌండర్ జాకబ్ బీరా, జెస్సీ బీర, ఫిన్నీ బీర తదితర 13 మంది బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. యంగ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆ ప్రాంతాన్ని సందర్శించిన వీరు 13 క్యాంపుల్లోని 390 కుటుంబాలకు చెందిన 1,257 మందికి రూ.10 లక్షల ఖరీదు చేసే రగ్గులు, దుప్పట్లు, బిస్కెట్లు, బియ్యం, పప్పు తదితర 16 రకాల వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో వీవీడీ ప్రసాద్, జి.జాన్‌రత్నం, అజరయ్య జాన్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థినికి ప్రథమ స్థానం



విద్యార్థిని జయశ్రీని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జాతీయ స్థాయిలో జరిగిన మాస్టర్ ఒరేటర్ చాంపియన్‌షిప్ ఇంగ్లిష్ స్పీకింగ్ కాంపిటీషన్‌లో తమ కళాశాల విద్యార్థిని ఆముదాలపల్లి జయశ్రీ ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. సోమవారం విద్యార్థినిని కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో నిర్వహించిన పోటీలలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 126 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా తమ కళాశాల నుంచి జయశ్రీ పాల్గొని మొదటి స్థానంలో నిలిచి విలువైన ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందుకుందన్నారు. కళాశాల ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, చంద్రశేఖర్, ఎల్.కరుణాకర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రతిభా పురస్కారాల అందజేత



పురస్కారాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండి: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో పాఠశాల, మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలను అందజేసింది. హెచ్ఎం ఎంపీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో నగదు బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు యు.హర్షిత, ఎ.మేరీరత్నం, ప్రోత్సాహక బహుమతిగా కె.ఆగ్నేస్‌లకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. అలాగే వివిధ స్కూల్ స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.2 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన వారికి రూ.1500 చొప్పున అందజేశారు. ఎంఈవోలు బి.జ్యోతి, బి.వినాయకుడు, హెచ్ఎంలు కృష్ణంరాజు, చక్రవర్తి, రవీంద్ర, రామలక్ష్మి, రత్నకుమార్, ఉపాధ్యాయులు సుబ్బరాజు, సునీల్‌కుమార్, ఛాముండేశ్వరి పాల్గొన్నారు.

15 తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 15వ తేది తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.2200లు రావాలంటే తేమ శాతం 17గా ఉండాలన్నారు.

నేడు వాండ్రంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉండి: ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వాండ్రం గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

ఆకివీడు: గుమ్ములూరు గ్రామంలోని సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కొప్పాడ రామకృష్ణకు చెందిన ఐదు ఎకరాల గడ్డివామి సోమవారం దగ్ధమైంది. స్థానికులు సమాచారం అందించగా, అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ. 20 వేలు నష్టం వాటిల్లిందని నాగేశ్వరరావు చెప్పారు. కాల్చి పారేసిన సిగరెట్ వల్ల నిప్పు రాజుకుని మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోకతిప్ప గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి అదృశ్యమైంది. కటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

గాండ్ల తెలకుల సంఘం నూతన అధ్యక్షునిగా చిప్పాడ



చిప్పాడ విజయకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: పట్టణ అఖిల గాండ్ల తెలకుల సంక్షేమ సంఘ నూతన అధ్యక్షునిగా చిప్పాడ విజయకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి స్థానిక గుత్తుల వానిపేటలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విజయకృష్ణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘ గౌరవాధ్యక్షునిగా చిప్పాడ మోహనరావు, సెక్రటరీ చిప్పాడ శ్రీను, ట్రెజరర్ మురపాక బాలాజీ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పరిశీలకునిగా చోడవరపు రామారావు వ్యవహరించగా, కెల్ల లక్ష్మీనారాయణ, ధర్మవరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాత శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీనివాస జ్యూయలర్స్ అధినేత గిరిజాల శ్రీనివాసరావు, మీనాక్షి దేవి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. సోమవారం ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావుకు విరాళం అందజేయగా, దాతను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి బాండ్ పత్రాన్ని అందజేశారు. ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు టీవీయూఆర్ శర్మ పాల్గొన్నారు.

నవంబర్ 9న ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవం



ఆర్ఆర్‌డీఎస్ కళాశాల స్వర్ణోత్సవాలకు విరాళం చెక్కును అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సం, రాజా రామ్మోహన్‌రాయ్ ద్విశత జయంతి స్వర్ణోత్సవాన్ని నవంబర్ 9న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వికేజే ప్రసూన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల సహకారంతో స్వర్ణోత్సవాలను నిర్వహించనున్నామని దీనికిగాను ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చెరుకువాడ రంగసాయి, ఇందుకూరి ప్రసాదరాజు, బీహెచ్ వెంకటపతి రాజు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. వేడుకల సందర్భంగా వసుధ ఫౌండేషన్ రూ.10 వేలు విరాళంగా అందించినట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థినికి నగదు అందిస్తున్న దృశ్యం

ఆకివీడు: పేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడం అభినందనీయమని సర్పంచ్‌ల చాంబర్ జిల్లా అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం అన్నారు. అయిభీమవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతి విద్యార్థినులు ఇద్దరికి రూ.2,500 చొప్పున, 8, 9, 10 విద్యార్థులు ముగ్గురికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి నుంచి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సామ్రాజ్యం మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, విద్యా వసతి వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కెనరా బ్యాంక్ బీఎం ఏవీఎస్ శర్మ, బ్యాంక్ అధికారులు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న అలంపురంలో ఉచిత మెగా వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురంలో ఈనెల 12న వెంకటరమణ సేవాఛారిటీ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. జనరల్ మెడిసిన్, అంకాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, 2డి ఈకో పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు అబ్బిరాజుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

యలమంచిలి: అబ్బిరాజుపాలెంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కార్యక్రమానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దిగమర్రులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి గుర్తించిన రోగులంతా ఈ వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) సందర్శిస్తారని ఎంపీడీవో చెప్పారు.

పొలంలో రైతుకు వైద్య పరీక్షలు



సిద్ధాపురంలో వరి పొలంలో రైతుకు వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం లక్ష్మి

ఆకివీడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటే కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో వారు ఎక్కడ ఉంటే అక్కడికే సిబ్బంది వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. సిద్ధాపురం గ్రామంలో ఇంటింటా సర్వే పూర్తి చేస్తున్న తరుణంలో కొంత మంది రైతులు అందుబాటులో లేకపోవడంతో సోమవారం వారి పొలాల వద్దకు ఏఎన్ఎం మాదాబత్తుల వెంకటలక్ష్మి వెళ్లి అక్కడ వైద్య పరీక్షల్ని నిర్వహించారు. రైతులు నామగిరి దామోదరరావు, బొడ్డిచెర్ల రాముడుకు బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మాట్లాడుతూ ఈ నెల 10న గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, క్యాంపు సమయానికి ప్రతి వ్యక్తికీ ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో భాగంగా పొలం గట్లకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. వైద్య పరీక్షలకు గ్రామ సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, గ్రామ ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు సహకరించారని ఏఎన్ఎం తెలిపారు.

పందిరి రాటకు పూజలు



పందిరి రాట నాటుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ 12వ వార్డులో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం పందిరి రాటకు పూజలు నిర్వహించి ఉత్సవాల ఏర్పాట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ఇన్‌చార్జి, పట్టణ రజక సంఘం అధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా గాన గంధర్వుడు పిప్పళ్ల ప్రసాద్ సాయి సంకీర్తనలు, భజనలు, ముగింపు రోజు అన్నదానం, అమ్మవారి ఊరేగింపుతో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. జడ్డు ఏడుకొండలు, తోట సతీష్, తోట సురేష్, నరసింహారావు, జడ్డు శ్రీను, పేరూరి దుర్గారావు, చింతాడ నాగలక్ష్మి పాల్గొన్నారు

స్పందనలో 8 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదులను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు బదలాయించామని తెలిపారు. స్పందన కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.